సోమ్‌లాల్‌నాయక్‌ను సత్కరించిన ఎమ్మెల్యే



హబ్సిగూడ: హబ్సిగూడలో నివాసముంటున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత కేతావత్ సోమ్‌లాల్‌నాయక్‌ను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించటంతో ఈ పురస్కారం దక్కిందని, ఆయనకు ఈ అవార్డు రావడంతో ఎంతో అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ నాయకులు పసూల ప్రభార్‌రెడ్డి, డాక్టర్ బీవీ.చారి, కాలేరు జైనవీన్, లింగానాయక్, రవినాయక్, కైలాషపతిగౌడ్, తిప్పని సంపత్, సంజయ్ జైన్, హరీష్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన కొమురవెల్లి చైర్మన్



కుషాయిగూడ: సిద్దిపేట జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి సోమవారం చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్‌ను కార్పొరేటర్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కొమురవెల్లిలో మెరుగైన వసతులు కల్పనకు కృషి చేయాలని అందుకు కావాల్సిన తోడ్పాటునందిస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కనకరాజుగౌడ్, రాఘవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



కుషాయిగూడ: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ సోమవారం వాటర్‌వర్క్స్ సీజీఎం నాగేందర్‌కు వినతిపత్రంఅందజేశారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో ఉన్న మంచినీటి పైప్‌లైన్ పనులతో పాటుగా భూగర్భ డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన సీజీఎం పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి



ప్రభుత్వ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నేరేడ్‌మెట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సందర్శించారు. కళాశాలలో జరుగుతున్న టాయిలెట్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు, మంచినీటి సమస్యలు పరిష్కరించండి



వాటర్‌వర్క్స్ ఏజీఎంను కలిసిన కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

కుషాయిగూడ: స్థానిక సమస్యలపై కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం వాటర్‌వర్క్స్ ఏజీఎం సతీష్‌కుమార్‌ను కలిశారు. కుషాయిగూడలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, మంచినీటి పైప్‌లైన్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే అధిక వాటర్ బిల్లులు, పాడైపోయిన బోర్ల మరమ్మత్తుల వంటి పలు సమస్యలను వివరించారు. అంతేకాకుండా సమీప పరిశ్రమల నుంచి వచ్చే కెమికల్ వ్యర్థాలను కాలనీకి చెందిన డ్రైన్‌లోకి వదలడం వల్ల దుర్వాసన వస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పసగట్ల చక్రపాణిగౌడ్, పంజాల బాబుగౌడ్, యాదయ్య, రాజు, నర్సింగ్‌రావు, మణికిరణ్, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో ఆధార్ చిన్న మొత్తాల పొదుపు సేవలు

ఉప్పల్: ఉప్పల్ తపాలా కార్యాలయంలో ఆధార్ చిన్న మొత్తాల పొదుపు సేవలు అందుబాటులో ఉన్నట్లు ఉప్పల్ పోస్టు మాస్టర్ ఆర్.గ్యామానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అధార్ చిరునామా, మొబైల్ నంబర్, కొత్త ఆధార్ కార్డ్ సేవలు, పది సంవత్సరాల లోపు ఆడ పిల్లలకు సుకన్య సమృద్ధి జీవిత భీమా, ఆర్‌డి,అధిక వడ్డీ రేట్స్ అందించే ఫిక్స్‌డ్ డిపాజిట్ ఉన్నాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి



జయరాజ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కుషాయిగూడ: భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రముఖ కవి, గాయకుడు జయరాజ్ అన్నారు. సోమవారం ఆయన కుషాయిగూడ, చక్రిపురంలో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధించి, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలంటూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్లాస్టిక్ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. అందులో బాగంగానే ఇక్కడకు వచ్చినట్లు పేర్కొన్నారు. గుమ్మడి హరిప్రసాద్, రంగన్న, గురుప్రసాద్, దొమ్మాడి కిరణ్‌కుమార్, శ్రీనివాసరావు, ఇంద్రపాల సత్యనారాయణ, శాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి
- జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అట్రాసిటీ కేసులపై సమీక్ష
- హాజరైన మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కలెక్టర్ గౌతం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: అట్రాసిటీ కేసుల బాధితులకు సత్వర న్యాయం జరిగేలా అధికారులు చూడాలని జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన వారిపై పలు ఒత్తిడులు వస్తుంటాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని వారికి పోలీసులు, ఇతర శాఖల అధికారులు అండగా నిలవాలని సూచించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ కేసు నమోదైన వెంటనే దర్యాప్తు ప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

కేసుల్లో ప్రత్యేక చొరవ చూపాలి: కలెక్టర్ గౌతం

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా సంబంధిత జిల్లా శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ ప్రభుత్వం చేపట్టే పౌరహక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్) – పీసీఆర్), అట్రాసిటీ నివారణ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ – పీవోఏ) చట్టాలను కచ్చితంగా అమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కేసులకు సంబంధించి రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులను తమ పరిధిలో ఇప్పటివరకు ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతిపై కలెక్టర్ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులను కలెక్టర్ కోరారు. సమావేశంలో మేడ్చల్ డీసీపీ నిఖితపంత్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఎస్సీ, ఎస్సీ కమిటీ మెంబర్లు వెంకటేశ్, ధనరాజ్ నాయక్, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10.30 నుంచి 1.30 వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తు న్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. నాచారం శ్రీకృష్ణా ఫార్మా, ఏపీ ఫుడ్ చౌరస్తా, టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రింటిగ్ ప్రెస్,నాచారం మెయిన్‌రోడ్, సింగచెరువు తండా, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ప్రసాద్ ఆస్పత్రి లైన్, మల్లాపూర్ నుంచి నాచారం మెయిన్‌రోడ్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

అల్వాల్: ప్రజావాణిలో అందిన దరఖాస్తులను పరిష్కరిస్తామని అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం అల్వాల్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో పలు సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. ముఖ్యంగా పింఛన్ కోసం వికలాంగులు, దోమల బెడద, పలు సమస్యలను తెలిపారు. ఈఈ రాజు, డీసీపీ సాంబయ్య, ఏఎంహెచ్‌వో మంజుల, ఎంటమాలజీస్ట్ ఏఈ అనిల్, ఏఈ లక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి పారిశ్రామికవాడ చైర్మన్‌గా సత్యనారాయణ రాజు



సాక్షి, సిటీబ్యూరో:మౌలాలి పారిశ్రామికవాడ నూతన చైర్మన్ గా దాట్ల సత్యనారాయణ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా మధుకర్ రెడ్డి, కోశాధికారిగా కెవిన్ బేనోజ్, కార్యనిర్వాహక సభ్యులుగా వాసుదేవ గౌడ్, వివేకానంద, వెంకట బాలకృష్ణ,మాధవరెడ్డి, రాంబాబు, విక్రంలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పురేందర్ సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పరిశ్రమల యజమానులు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన చైర్మన్ మాట్లాడుతూ... పారిశ్రామిక వాడ అభివృద్ధి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఉప్పల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నాచారం డివిజన్‌లో మొత్తం రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. నాచారం ప్రధాన రహదారి సెయింట్ పీటర్స్ స్కూల్ నుంచి శాంతి గార్డెన్ వరకు రూ.1.30 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు, వార్డు కార్యాలయం నుంచి భక్త సమాజ్ వరకు రూ.70 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాచారంలో దశల వారీగా ప్రణాళిక బద్ధంగా అన్ని పనులను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ కోఆప్షన్ సభ్యురాలు విద్యా స్రవంతి, గ్రేటర్ బీఆర్ఎస్ నేత సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకంలో పేరుపై రగడ

పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు





ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాచారం కాంగ్రెస్ నేతలు

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో పలు అభివృద్ధి పనుల కోసం శంకుస్థాపన కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకలపై రగడ నెలకొంది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేరు కింద మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేరు ఉండటం తో ప్రొటోకాల్‌ను పాటించలేదని, నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డికి శిలా ఫలాకలపై విచారణ చేయాలని కోరుతూ నాచారం కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో నాచారం పోలీసులు ఫిర్యాదు స్వీకరించి విచారిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాంరెడ్డి, కృష్ణారెడ్డి, హెచ్‌ఆర్. మోహన్, శ్రీకాంత్ గౌడ్, నూతనకంటి రాజు, సునీల్‌రెడ్డి, మహేష్. కాంత్రి కిషోర్ తదితరులు ఫిర్యాదు చేశారు.

పీర్జాదిగూడ జలమండలి మేనేజర్‌గా తిరుపతి



జలమండలి నూతన మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నగర మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ జలమండలి విభాగం మేనేజర్‌గా ఎన్.తిరుపతి నియమితులయ్యారు.గతంలో పీర్జాదిగూడలో పని చేసిన రమ్య బదిలీ కావడంతో పీర్జాదిగూడ జలమండలి నూతన మేనేజర్‌గా ఎన్.తిరుపతి నియమితులయ్యారు.ఆయన సోమవారం భాద్యతలను తీసుకున్నారు. ఈ సంద్భంగా నగర మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నమ్యా నాయక్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

మల్లాపూర్: నాచారం బాబానగర్, హనుమాన్ నగర్‌లో మురుగు నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీసభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. సోమవారం డ్రైనేజీ సమస్యపై జలమండలి,ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ డ్రైనేజీని పరిశీలించారు. గత కొంత కాలంగా డ్రైనేజీ బార్డర్‌లో ఉండటంతో పని చేయ కుండా అధికారులు తప్పించుకుంటున్నారు. సమన్వయంతో అధికారులు పైప్ లైన్ పనులను పూర్తి చేయాలని అధికారులకు కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, ఈఈ హరిలాల్, జలమండలి మేనేజర్ సందీప్ పాల్గొన్నారు.

కోదండరామ్‌కు పలువురి శుభాకాంక్షలు



కుషాయిగూడ: ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాంరెడ్డిని సోమవారం కుషాయిగూడకు చెందిన అయ్యన్నగారి మధుసూదన్‌రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించి ఘనంగా సత్కరించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన వారికి తగిన గుర్తింపు లభించేలా చూడాలని కోరినట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చరణ్‌జిత్‌గౌడ్



నియామక పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం యూత్ విభాగం అధ్యక్షుడిగా మల్కాజిగిరికి చెందిన జిడి చరణ్‌జిత్‌గౌడ్ నియమితులయ్యారు.మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డిలు నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ పటిష్టానికి తన వంతు కృషి చేస్తానని చరణ్‌జిత్‌గౌడ్ తెలిపారు. నాయకులు జీఎన్వీసతీష్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, అశోక్‌రెడ్డి సంపత్‌గౌడ్, సానాదిశంకర్,బి.కె.శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సునీతరాముయాదవ్

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ సోమవారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం అందచేశారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేయాలని వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ కేటాయించండి



అల్వాల్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ టికెట్ కెటాయించాల్సిందిగా కోరుతూ బిజెవైఎం స్పోర్ట్స్ కన్వీనర్ జి. రాముయాదవ్ ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్‌ను కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు.

కొల్తూర్‌లో ఉచిత వైద్య శిబిరం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామంలో మెడిసిటి దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, ఊపిరితిత్తులతో పాటు ఇతర పరీక్షలు చేసి మందులు అందజేశారు. మొత్తం 133కి పరీక్షలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఒమార్, అభిషేక్, కావ్య, జాహ్నవి, దివ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్

రూ. 12 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఐ ప్రమోద్‌కుమార్

అల్వాల్: ఇంటి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి నగలను అల్వాల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూల్‌కు చెందిన ఆర్. అశోక్‌రెడ్డి, బి. మురళీధర్‌రెడ్డిలు వరుసకు సోదరులు. ఇటీవల అప్పులు అధికం కావడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకొని ఈ నెల 20న వారి స్నేహితుడి వద్ద పని ఉందని చెప్పి పల్సర్ బైక్ తీసుకొని అల్వాల్ పంచశీల కాలనీకి వెళ్లి తాళం వేసి ఉన్న ఇళ్లను గమనించి కిటికి గ్రిల్ తొలగించి లోపలికి ప్రవేశించారు. బెడ్ రూమ్‌లో ఉన్న కబోర్డ్‌ను పగులగొట్టి అందులో ఉన్న నగలు దోచుకొని పారిపోయారు. బాదితులడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 28న సాయంత్రం అల్వాల్ వివిఆర్ గార్డెన్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న నిందితులు ఇద్దరిని పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. ద్విచక్ర వాహనంతోపాటు దొంగిలించిన రూ.4 లక్షల 50 నగదుతోపాటు మొత్తం 12 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాగా వీరిలో మురళీధర్‌రెడ్డి 2014వ సంవత్సరంలో అనంతపురంలో ఓ దొంగతనం కేసులో అరెస్టై జైలుకు వెళ్లి వచ్చాడు. దొంగతనం కేసును చాకచక్యంగా పరిశోధించి నేరస్తులను అరెస్టు చేయ్యడంలో కీలక పాత్ర వహించిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్, సిబ్బంది విద్యాకర్‌రావు, గౌస్ పాష, రమాకాంత్, శ్రీకాంత్, రాజశేఖర్, సుదాకర్‌లను ఉన్నత అధికారులు అభినందించారు.

హత్యకేసులో ఇద్దరి అరెస్ట్



అకుల్ నాయక్ బహానో బిసాయి

మల్కాజిగిరి: హత్య కేసులో ఇద్దరిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు.ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం...ఉప్పరిగూడ పిట్టల బస్తీలో ఒరిస్సాకు చెందిన బ్రహ్మానంద బిసోయి తన ఐదుగురు స్నేహితులతో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 22 వ తేదీ వారు కిరాయికి ఉంటున్న ఇంటి నుంచి గొడవ శబ్దం రావడంతో ఇంటి యజమాని ఆశాదేవి వెళ్లి చూసేసరికి బొల్లు(35) రక్తపు మడుగులో చనిపోయి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నార్సింగ్‌లో ఉన్న అకుల్‌నాయక్(39), బహానో బిసాయి(40)ని అదుపులోకి తీసుకొని విచారించడంతో హత్య నేరం ఒప్పుకున్నారు. తాగిన మైకంలో అకుల్‌నాయక్ భార్య గురించి తప్పుగా మాట్లాడడంతో గొడవ జరిగింది. ఇద్దరినీ వారి కుటుంబసభ్యులను చంపేస్తానని బెదిరించడంతో హత్య చేయడానికి నిర్ణయించుకొని బొల్లు కాళ్లు బహానో పట్టుకోగా ఇనుపరాడ్‌తో అకుల్ బొల్లు పై దాడి చేసి హత్య చేశాడు. వారిద్దరినీ కోర్టులో హాజరుపరిచామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ

ఉప్పల్: ఉప్పల్ మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నికయింది. అధ్యక్షుడిగా మణికంఠ, కార్యదర్శిగా అవినాష్, గౌరవ అధ్యక్షులుగా కేతావత్ అనుదీప్ నాయక్, ఉపాధ్యక్షులుగా జి. రాజేష్, శివ, జె. శ్రీమన్, మండల సహాయ కార్యదర్శులు బండారి సాయి చరణ్, బోడ్డుపల్లి శ్రీధర్ లు కలిపి 18 మందితో నూతన కమిటీ ఎన్నికైంది.

క్రీడల్లో ప్రతిభ చూపిన యాప్రాల్ విద్యార్థులు



అల్వాల్: ఫుట్‌బాల్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్, ఫుట్‌బాల్ స్కేటింగ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఛాదర్‌ఘట్ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో ఇంటర్ స్కూల్ ఫుట్‌బాల్ స్కేటింగ్ లీగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో యాప్రాల్ అర్ష స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మెర్సీ, తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ప్రేమ్‌రాజ్‌లు విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను అందచేశారు.

కోదండరామ్‌కు వినతిపత్రం అందజేత



అల్వాల్: తెలంగాణ రాష్ట్రంలోని ఉన్నత విద్యా మండలి (టీఎస్‌సీహెచ్‌ఈ)లో కార్యదర్శి పదవిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయులతో తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధ్యాపకుల సంఘం (టీజీసీటీఏ) కార్యదర్శి డాక్టర్ ఇ.బ్రిజేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో టీజీసీటీఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.